సాక్షి తిరుపతి

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



యల్లంపల్లిలో గజరాజులు

యల్లంపల్లిలోని పంట పొలాలపై గజరాజుల గుంపు జీభత్సం సృష్టించాయి. పంటలను తొక్కి నాశనం చేశాయి. - 8లో



మందుల వాడకంలో జాగ్రత్తలు

రోగులు మందుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచిన్ పేర్కొన్నారు. - 8లో



ఎర్ర చందనం స్వాధీనం

సదాశివ పాలకోన ప్రాంతంలో అటవీశాఖ అధికారులు ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

చిరుత సంచారంపై అధికారుల అప్రమత్తం



సూచిక బోర్డులను పరిశీలిస్తున్న నూతన వీసీ

తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలో చిరుత సంచారంపై వీసీ ఆచార్య నర్సింగరావు విశ్వవిద్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆ పరిసరాల్లో ఆయన పరిశీలించి సెక్యూరిటీ సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించే ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు, ఆ ప్రాంతంలో తిరిగే వారికి తెలిసేలా బారికేడ్లను, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్‌లో వెంకన్న శ్లోకం

- ఓం నమో వెంకటేశాయ



స్వామి, అమ్మవార్ల చిత్రపటం వద్ద ఓం నమో వెంకటేశాయ శ్లోకం ఏర్పాటు

తిరుపతి అర్బన్ : ఓం నమో వెంకటేశాయ శ్లోకాన్ని కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన ద్వారం వద్ద స్వామి, అమ్మవార్ల చిత్రపటం వద్ద శనివారం ఏర్పాటు చేశారు. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం టీటీడీకి చెందిన భవనం నేపథ్యంలో ప్రధాన ద్వారం వద్ద స్వామి, అమ్మవార్లకు చెందిన పెద్ద చిత్రపటాలను ఎప్పటి నుంచో ఏర్పాటు చేసి ఉన్నారు. అయితే భక్తి భావాన్ని మరింత పెంచేలా ఓం నమో వెంకటేశాయ శ్లోకాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఈ శ్లోకాన్ని ఉంచుతారా? ప్రతి శనివారం ఉంచుతారో చూడాల్సిందే.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ : జాతీయ స్థాయి ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ, 9వ తరగతులలో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎస్.విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2014 నుంచి 2016 మధ్య జన్మించిన విద్యార్థులు ఆరో తరగతి ప్రవేశాలకు, 9వ తరగతిలో ప్రవేశాల కోసం 2011 ఏప్రిల్ 1వ తారీఖు నుంచి 2013 మార్చి 1వ తారీఖు మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్‌తో పాటు మరిన్ని వివరాలకు తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం నందు లేదా 8688888802 / 9399976999 నంబర్ల నందు సంప్రదించాలని ఆయన తెలిపారు.

'నేలపట్టు'లో జర్మనీ దేశస్తులు



కృత్రిమ విహంగాల వద్ద జర్మనీ దేశస్తులు

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని శనివారం తడ ప్రాంతంలోని శ్రీసిటి నుంచి జర్మనీ దేశానికి చెందిన విదేశీయులు యాసుకోచిఎసి, మసాటోనిషియారా సందర్శించారు. కేంద్రంలోని చెరువుల్లో ఆశించిన స్థాయిలో వలస పక్షులు లేకపోవడంతో నిరుత్సాహంగా వెనుదిరిగారు. అక్కడే ఉన్న ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ విదేశీయులను పలకరించి జామ మొక్కలను అందజేశారు.

తాళపత్రాల భద్రత అభినందనీయం

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ప్రతిష్టాత్మకమైన ప్రాచీన తాళపత్ర గ్రంథాలయాన్ని (ఓఆర్ఐ)ని శనివారం నూతన వీసీ తాతా నర్సింగరావు సందర్శించారు. గతంలో వెబ్‌సైట్‌లో చూసిన తాళపత్ర గ్రంథాలను నేరుగా ఆయన చూసి ఆశ్చర్యపోయారు. సంస్థ సంచాలకులు ఆచార్య వీసీ వెంకటేశ్వర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరిరక్షణకు తీసుకుంటున్న శాస్త్రీయ విధానాలను చూసి అభినందించారు. ఇంత పెద్ద స్థాయిలో ప్రాచీన సాహిత్యం భద్రంగా సంరక్షించడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, చంద్రశేఖర్, డాక్టర్ వెంకటేష్, సిద్దయ్య, బాషా, నాగరాజు,శోభన్ బాబు,విశ్వనాథ్ రెడ్డి, పరిశోధకులు సంతోష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం సమాజం నిద్రలేవక ముందే పరిసరాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి.. అలాంటి చిరుద్యోగుల పొట్టకొట్టడం దారుణం. తిరుపతిలోని రుయా, తదితర ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను వయస్సు పేరుతో 60 మంది కార్మికులను ఓ ఏజెన్సీ నిర్దాక్షిణ్యంగా తొలగించింది. ఆ చిరుద్యోగాన్నే నమ్ముకొని కుటుంబాలను పోషిస్తున్న కార్మికులను ఆ వయస్సులో రోడ్డున పడేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి న్యాయం చేయాలని కార్మికులు వేడుకుంటున్నారు.



రుయాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న తొలగించిన కార్మికులు, సీఐటీయూ నాయకులు

కార్మికులపై కర్కశం

68 మంది కార్మికులపై వేటు

- 50 ఏళ్ల పేరుతో తొలగింపు
- లబోదిబోమంటున్న పారిశుద్ధ్య కార్మికులు
- అన్ని సంస్థల్లోనూ 62 ఏళ్ల పరిమితితో పనులు
- కడుపు కొట్టద్దని వేడుకుంటున్న పారిశుద్ధ్య కార్మికులు



రుయా వద్ద విధుల కోసం ఎదురు చూస్తున్న కార్మికులు

తిరుపతి తుడా : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన పెత్తనం తెరమీదకు వచ్చింది. తనకున్న పలుకుబడితో ఆసుపత్రులు, ఆలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్టును అధికారికంగా చేజిక్కించుకున్నారు. గతంలో ఆ సంస్థ టీటీడీలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టిన కాలంలో కార్మికులను వేధించడంతో వరుస ఆందోళనలు కొనసాగాయి. నిత్యం ధర్నాలతో దద్దరిల్లేది. ఈ క్రమంలో ఆయనకు ఉద్వాసన పలికారు. మరోసారి పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్ట్‌ను అక్టోబర్ 1 నుంచి రుయా, ఎస్వీ మెడికల్ కళాశాల, మెటర్నిటీ ఆసుపత్రుల పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను ఓ ఏజెన్సీ తీసుకుంది. పనులు ప్రారంభించిన పది రోజుల్లోనే కార్మికులపై ఆ ఏజెన్సీ వేధింపులు ప్రారంభించింది. ఏకంగా 65 మంది పారిశుద్ధ్య కార్మికులను 50 ఏళ్ల వయస్సు ఉందని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అన్ని సంస్థల్లో 62 ఏళ్ల వయస్సు వరకు కొనసాగిస్తుండడం విశేషం.

లబోదిబోమంటున్న పారిశుద్ధ్య కార్మికులు

15 ఏళ్లకు పైగా పారిశుద్ధ్య వృత్తినే నమ్ముకుని వందల మంది కార్మికులు ఎస్వీ మెడికల్ కళాశాల పరిధిలో పనిచేస్తున్నారు. కాంట్రాక్ట్ సంస్థ మారడంతో 50 ఏళ్ల పరిమితిని విధిస్తూ తొలగించారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు లబోదిబోమంటున్నారు. ముందస్తు ఒక మాట చెప్పకుండా, ఎక్కడా లేని విధంగా కక్ష కట్టి తొలగించారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హఠాత్తుగా తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పట్ల ఇంత కక్షపూరితంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని 62 ఏళ్ల వరకు కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆధార్ తారుమారు చేసినట్లు ఆరోపణలు

రాజకీయ నేతల నుంచి కాంట్రాక్టు సంస్థకు ఒత్తిడి రావడంతో 50 ఏళ్లు పైబడిన వారిని తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే నకిలీ కార్డులు సృష్టించి అందు లో వయసు తగ్గించి విధుల్లోకి తీసుకున్నట్లు ఆరోపణ లు ఉన్నాయి. ఇదే విషయాన్ని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. 25 మందికి ఇదే విధంగా నకిలీ ఆధార్ కార్డులతో విధుల్లోకి తీసుకున్నారని చెబుతున్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డులో ఉన్న 68 మందిని నిర్దాక్షిణ్యంగా తొలగించేశారు.

నిబంధనలు పట్టించుకోని ఏజెన్సీ

ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ ఉంటుంది. ప్రస్తుతం ఆ నిబంధనే అన్ని సంస్థల్లోనూ కొనసాగుతోంది. కానీ రుయా, ఎస్వీ మెడికల్ కళాశాల, మెటర్నిటీ ఆసుపత్రుల్లో పారిశుద్ధ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన పద్మావతి హాస్పిటాలిటీ అండ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ 50 ఏళ్లకే వృద్ధులుగా ప్రకటించి విధుల నుంచి తొలగించేసింది. 50 ఏళ్ల పరిమితిని పెట్టి రుయాలో 48 మందిని, ఎస్వీ మెడికల్ కళాశాలలో 10 మందిని, మెటర్నరీ ఆసుపత్రిలో 10 మంది మొత్తంగా 68 మంది పారిశుద్ధ్య కార్మికులను పీకి పడేసింది. టీటీడీ, ఇతర సంస్థల్లోనూ 62 ఏళ్ల వరకు పారిశుద్ధ్య కార్మికులను కొనసాగిస్తోంది. ఆ మూడు సంస్థల్లో మాత్రమే ఎందుకు 50 ఏళ్ల పరిమితి పెట్టి తొలగించారనేది చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ జీవోలో లేకున్నా...

ప్రస్తుత ఏజెన్సీ టెండర్ తగ్గించుకున్న జీవోలో 50 ఏళ్ల పరిమితి నిబంధన పెట్టలేదు. అయితే తనకున్న పలుకుబడితో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ప్రత్యేకంగా ఓ ఆర్డర్ తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ జీవోను పక్కనపెట్టి ఆ ఆర్డర్‌ను చూపిస్తూ 50 ఏళ్ల వరకే అంటూ కార్మికులను తొలగించేశారు.

కార్మికులను కొనసాగించాలి



పారిశుద్ధ కార్మికులపై విధించిన 50 ఏళ్ల పరిమితి దుర్మార్గమైన చర్య. కనీస సమాచారం లేకుండా విధులను తొలగించడం సరైంది కాదు. 15 ఏళ్లకు పైగా ఇక్కడే పనిచేస్తున్నారు. అలాంటి వాళ్లని తొలగించడం అన్యాయం. 50 ఏళ్లకే కార్మికులు పనిచేయలేరంటున్న భాస్కర్ నాయుడుకు కూడా 50 ఏళ్లు దాటింది. మరి ఆయన కూడా తన సర్వీసెస్‌ను రద్దు చేసుకోవాలి.కాంటాక్ట్ సంస్థ ఆలోచన నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని కార్మికులను కొనసాగించాలి.– పి.మహేంద్ర, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి

అన్యాయంగా తొలగించారు



నాకు 50 ఏళ్లు కూడా పూర్తి కాలేదు. 50లోకి అడుగు పెట్టానని నన్ను కూడా తొలగించేశారు. ఇదెక్కడి అన్యాయం. ఎంత దారుణంగా వ్యవహరించడం మంచిది కాదు. కార్మికులపై కక్ష గట్టి ఏం సాధిస్తారు. కాంట్రాక్టు సంస్థ పెద్ద మనసుతో మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి. లేకుంటే రుయా నుంచి కదిలేది లేదు. – జి. భాను, తొలగింపునకు గురైన పారిశుద్ధ్య కార్మికులు

20 ఏళ్లుగా పనిచేస్తున్నా



20 ఏళ్లుగా రుయాలోనే పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నా. హఠాత్తుగా 50 ఏళ్లు దాటాయని తొలగించారు. ఇక్కడ కష్టపడి పనిచేస్తే వచ్చే డబ్బులతోనే నేను కుటుంబాన్ని పోషిస్తున్నా. అన్యాయంగా నన్ను రోడ్డున పడేశారు. నా కుటుంబాన్ని ఎలా పోషించాలి. మమ్మల్ని 62 ఏళ్ల వరకు కొనసాగించాలి. – అనురాధ, తొలగింపునకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు

అన్నిచోట్ల కొనసాగిస్తున్నారు



టీటీడీ , మున్సిపాలిటీ, ఇతర అన్ని సంస్థలలోని 62 ఏళ్ల వరకు కొనసాగిస్తున్నారు. కేవలం రుయాలో 50 ఏళ్ల పరిమితిని పెట్టి తొలగించారు. అన్యాయంగా మా కడుపులు కొడుతున్నారు. మా స్థానంలో కొత్త వారిని నియమించి పనులు చేయిస్తున్నారు. మా కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడండి. మమ్మల్ని కొనసాగించకుంటే ఎంతవరకు అయినా వెళతాం. – బేబీ, తొలగింపునకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి



50 ఏళ్ల వయో పరిమితిని పెట్టి మమ్మల్ని అన్యాయంగా తొలగించారు. వెంటనే విధుల్లోకి తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. కనీస సమాచారం లేకుండా మమ్మల్ని విధుల్లోకి రావద్దు అంటున్నారు. మా పట్ల ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం సరైంది కాదు. – సరోజ, తొలగింపునకు గురైన పారిశుద్ధ్య కార్మికురాలు

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువ గా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయాయి. భక్తులు వేచి ఉన్న క్యూ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,468 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,878 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.86 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 20 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకె న్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

ఉగ్రరూపం దాల్చిన బహుదానది

కొట్టుకుపోయిన నాలుగు కల్వర్టులు

- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



గాజులపల్లె సమీపంలో బహుదానదిలో ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు

తవణంపల్లె: మండలంలోని బహుదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలతో పాటు అరగొండ వద్ద బహుదానది ఉగ్రరూపం దాల్చింది. పడమటి మండలాల్లోని అడవుల్లో నుంచి భారీగా వర్షపు నీరు చేరుతోంది. మాధవరం వంక, బోయపల్లె వంక, మత్యం వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఇవి బహుదానదిలో కలవడంతో నదికి వరద నీరు పోటెత్తింది. శనివారం సాయంత్రానికి నదిలో నీటి శాతం కొంతమేర తగ్గింది.

తెగిన కల్వర్టులు

ప్రతి ఏటా భారీ వర్షాలప్పుడు కల్వర్టులు తెగిపోవడం రివాజుగా మారుతోంది. అరగొండ–గాజులపల్లె మధ్యలో ఉన్న కల్వర్టు, గాజులపల్లె–సరకల్లు రోడ్డు మధ్యలో తొడతర దగ్గర ఉన్న కల్వర్టు, అరగొండ– ఎ.గొల్లపల్లెకు వెళ్లే దారిలోని కల్వర్టు, మత్యం క్రాస్– ఎగువ మత్యం వెళ్లే దారిలోని కలర్టులు వరద ఉధృతికి కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కనీసం పాల వ్యాన్లు, స్కూల్ బస్సులు కూడా తిరగడం లేదు. వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో 35 గంటల పాటు స్థానికులు అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు తగ్గుముఖం పట్టి వాగుల్లో ప్రవాహం ఉధృతి తగ్గే వరకు జనాలు తెగిన కల్వర్టులపై వెళ్లరాదు. వరద ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టు దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనాలు, ప్రజలు వెళ్లకుండా అడ్డుకట్టలు వేయించారు.

– సుధాకర్, తహసీల్దార్



అరగొండ-ఎ.గొల్లపల్లె రోడ్డులో బహుదానదిలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్డు కల్వర్టు



అరగొండ- గాజులపల్లె రోడ్డులో కల్వర్టు దెబ్బతినడంతో ప్రజలు, వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్టలు వేసిన అధికారులు

ఎన్టీఆర్ జలాశయం గేట్ల ఎత్తివేత



చిత్తూరు-పెనుమూరు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పెనుమూరు(కార్వేటినగరం): జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు కలవకుంట వద్ద ఉన్న ఎన్టీర్ జలాశయం గేట్లను శనివారం ఇరిగేషన్ అధికారులు ఎత్తివేశారు. మొత్తం 6 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయానికి ఎగువ ప్రాంతాలైన పూతలపట్టు, పాకాల, దామలచెరువు, ఐరాల ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. పది వేల క్యూసెక్కుల నీరు చేరడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఏఈ భరత్ తెలిపారు. చిత్తూరు– పెనుమూరు జాతీయ రహదారిపై జలాశయం నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జలాశయానికి దిగువన ఉన్న జీడీనెల్లూరు ప్రజలు, అలాగే నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు ఎలాంటి పరిస్థితుల్లోనూ నదిని దాటేందుకు సాహసించొద్దని సూచించారు.

10 టన్నుల ఎర్ర చందనం స్వాధీనం



ఢిల్లీలో పట్టుబడిన ఎర్రచందనం, నిందితులను తిరుపతిలో చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

- ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్ట్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో పది టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తిరుపతి ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ వెల్లడించింది. తిరుపతిలోని కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్ శనివారం వారు మీడియాతో మాట్లాడారు. టాస్క్‌ఫోర్స్ బృందం వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలంలోని పత్తూరులో తమిళనాడుకు చెందిన రాజ్‌కుమార్ ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో ఆగస్టు 2న పట్టుబడ్డాడన్నారు. విచారణలో మరికొంతమంది నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు తేలడంతో దీనిపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, ప్రత్యేక బృందాన్ని ఢిల్లీకి పంపామన్నారు. ఈ నెల 6న ప్రధాన నిందితుడు మొహమ్మద్ ఇర్ఫాన్, మరో నిందితుడు అమిత్‌సంపత్ పవార్‌ను అరెస్టు చేశామన్నారు. మొత్తం 356 ఎర్రచందనం దుంగలను (9,576 కిలోలు) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.8 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జమేదారు చిరంజీవి

చంద్రగిరి : శ్రీవారి దర్శనార్థం శ్రీవారి మెట్టు మార్గంలో తిరుమలకు కాలినడక వెళ్తున్న కుటుంబం నుంచి బాలుడు తప్పిపోయిన ఘటన శనివారం చోటు చేసుకుంది. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు... రాజంపేటకు చెందిన వెంకటేష్ కువైట్‌లో పనిచేస్తున్నాడు. శ్రీవారి దర్శనార్థం వెంకటేష్ భార్యతో పాటు తమ్ముడు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లారు. ఈ క్రమంలో శ్రీవారిమెట్టు వద్ద వెంకటేష్ కుమారుడు పార్థీవ్ తప్పిపోయి ఏడుస్తూ ఉండడాన్ని అక్కడే విధులు నిర్వహిస్తున్న జమేదారు చిరంజీవి గుర్తించాడు. అనంతరం బాలుడిని విచారించగా వివరాలను తెలిపాడు. ఈ మేరకు వెంకటేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం వెంకటేష్, తన తమ్ముడు రమేష్‌కు సమాచారాన్ని చేరవేశాడు. అనంతరం రమేష్‌తో పాటు బాలుడు తల్లి శ్రీవారిమెట్టు వద్దకు చేరుకుని తమ బాలుడిని గుర్తించారు. జమేదారు తప్పిపోయిన బాలుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో, భక్తులు టీటీడీ విజిలెన్స్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

వానెల్లూరు అక్రమాల గుట్టురట్టు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ మురళీ నాయుడు

సత్యవేడు : సత్యవేడు మండలం వానెల్లూరు గ్రామంలో 300 ఎకరాల అటవీ భూములకు సంబంధించి రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో అక్రమ నమోదుకు సంబంధించి 16 మంది నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీ నాయుడు తెలిపారు. శనివారం సత్యవేడు తహసీల్దారు రాజశేఖర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వానెల్లూరులో సర్వే నంబరు 197లో 287.64 ఎకరాలు తంబి అలియాస్ రాజ పిళ్లై పేరుపై ఉన్నట్లు రెవెన్యూ ఎస్ఎల్ఆర్ రికార్డుల్లో ఉందన్నారు. అనంతరం ఆ భూమి నాలుగు సబ్ డివిజన్లుగా విభజించి ఇందులో 197/1లో 252.16 ఎకరాలు 1972లో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అటవీ భూములుగా ప్రకటించారు. అయితే ఇదే సర్వే నంబరు భూములను 197/1 ఏ నుంచి ఎఫ్ వరకు చెన్నైకి చెందిన ఆరుగురి పేర్లుపై 2024 జూన్ 12వ తేదీన రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో నమోదు చేశారన్నారు. ఈ భూముల నమోదులో రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించి సాదాబైనామా ద్వారా అప్పటికే మల్లీశ్వరీ పేరుతో ఉన్న సర్వే నంబరు 186-2ఏ2 , హనుమంతు బాతమ్మ పేరుతో సర్వే నంబరు 138/2కు సంబంధించి వెబ్ ల్యాండ్ తెరిచి నమోదు చేశారు. అయితే ఈ ప్రక్రియలో అప్పటి తహసీల్దారు రామాంజనేయులు వేలి ముద్ర వేస్తేనే వెబ్‌ల్యాండ్‌లో నమోదు అవుతుందన్నారు. ఎన్నికల విధులకు వచ్చిన రామాంజనేయులు 2024 ఫిబ్రవరి 7 నుంచి జూలై 27 వరకు సత్యవేడులో తహసీల్దారుగా పనిచేశారు. అప్పటి కన్నావరం సచివాలయం వీఆర్‌ఓ భార్గవ్ ఆయన సతీమణి తేజస్వీ, అప్పటి సచివాలయ సిబ్బంది పూర్ణచందు నాయుడు, ఆధార్ కార్డులతో పట్టాదార్ పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు లేని భూములను తప్పుడు రికార్డులతో విక్రయించడానికి చెన్నైకి చెందిన ఆరుగురు స్కెచ్ వేశారన్నారు. ఈ సమాచారం రెవెన్యూ అధికారులకు అందడంతో ప్రస్తుత తహసీల్దారు రాజశేఖర్ దీనిపై దృష్టి సారించి జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశారన్నారు. అటవీ భూములు వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వారిలో తమిళనాడుకు చెందిన శ్రీధరన్, అమృతవర్షిని, నవీనరాజ్‌కన్న, అనూరాధ, జైరేమార్, లతజయ్‌కుమార్, ఆశాసురేష్ ఉన్నట్లు తెలిపారు. ఆశా సురేష్ పేరుతో సర్వే నంబరు 200/1లో 49.88 ఎకరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదైనట్లు పేర్కొన్నారు. ఎటువంటి ఆధార్ కార్డులు, రికార్డులు ఏవీ లేకుండా వెబ్ ల్యాండ్‌ల్లో అటవీ భూములను నయోదు చేయడం జరిగిందన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆరుగురు అధికారులపైన మిగిలిన ప్రైవేటు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అటవీ భూములకు సంబంధించి రెవెన్యూ, అటవీ అధికారులు ఉమ్మడి సర్వే చేయిస్తామన్నారు. సర్వే నంబరు 197/1లో అటవీ భూములు యథాస్థితిలో ఉండగా ఇదే సరే నంబర్ ఆరు సబ్ డివిజన్లుగా ఇతరుల భూ ఖాతాల్లోకి వెళ్లి నమోదు చేశారన్నారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేసి అసలైన సూత్రదారులు ఎవరో నిగ్గు తేల్చడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్ర చందనం స్వాధీనం

ఏర్పేడు : మండలం చెల్లూరు సమీపంలోని సదాశివ పాలకోన ప్రాంతంలో అటవీశాఖ అధికారులు శనివారం ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి అటవీ శాఖ అధికారి లోకేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సదాశివ పాలకోనలో దాడులు నిర్వహించి మొత్తం 435 కిలోల బరువున్న 51 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.11 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. సదాశివపాలకోన ప్రాంతంలో ఎర్ర చందనం స్మగ్లర్లు ఉన్నారనే రహస్య సమాచారంతో దాడులు చేపట్టగా, స్మగ్లర్లు పారిపోయారని తెలిపారు. దుంగలను అక్కడే వదిలి వెళ్లారన్నారు. అటవీ ప్రాంతంలో మరికొన్ని ఎర్ర చందనం చెట్లు నరికివేసినట్లు గుర్తించి, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు.

రోడ్డుపై మందు'బాబు' చేష్టలు



మందు పక్కన పెట్టుకొని మద్యం మత్తులో తూలుతున్న వ్యక్తి

రేణిగుంట : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఉదయం రోడ్డుపైన ఓ మందు బాబు ఫుల్‌గా మత్తులో తూలుతూ తనతో తెచ్చుకున్న మూడు కోటర్ల మందును పక్కన పెట్టుకొని షర్టు విప్పి విచిత్రంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో అటుగా వెళ్లేవారు చూస్తూ బాబు గారి మందు మహిమ అంటూ చర్చించుకోవడం కనిపించింది. రేణిగుంటలో 24 గంటలు మందు అందుబాటులో ఉందనేందుకు ఇదో ఉదాహరణ అని స్థానికులు చెబుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



రేణిగుంట : మండలంలోని కడప రహదారి ఆంజనేయపురం చెక్‌పోస్ట్ సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో శనివారం రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వయస్సు సుమారు 50-55 సంవత్సరాలు, ఎత్తు సుమారు 5'6'', నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. అనారోగ్య, మరే ఇతర కారణంతో మృతి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మరణించిన వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే రేణిగుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలాల్లో నుంచి కారును వెలుపలికి తీస్తున్న దృశ్యం

కలువాయి(సైదాపురం):మండలంలోని కుల్లూరు జాతీయ రహదారిపై కలువాయి నుంచి కడపకు వెళ్తున్న కారు శనివారం అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రహదారిపై సరైన సూచిక బోర్డు లేనందున వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

నాయుడుపేటటౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద రైలు ఢీకొన్న ప్రమాదంలో వేపగుంట మస్తానమ్మ(45) అనే మహిళ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గూడూరు రైల్వే ఎస్ఐ చెన్న కేశవులు తెలిపిన మేరకు వివరాలు.. నాయుడుపేట పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన వేపగుంట మస్తానమ్మ మతిస్థిమితం సరిగాలేక ఎన్ఎస్ఆర్ కాలనీ వద్ద శనివారం ఉదయం రైల్వే పట్టాలను దాటుతుండగా విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనగా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

– అగ్రహారంలో విషాదఛాయలు



మృతిచెందిన వృద్ధ దంపతులు

కలువాయి(సైదాపురం): ఆవృద్ధ దంపతులకు ఏకష్టమొచ్చిందో ఏమో తెలియదు. శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కలువాయి మండలంలోని తోపుగుంట అగ్రహారం గ్రామానికి చెందిన వింజం కొండయ్య(70), అతని భార్య వింజం రత్నమ్మ(65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. గత కొంత కాలం నుంచి కుటుంబ కలహాలతో తీవ్రంగా మనస్తాపం చెందారని తెలుస్తోంది. ఈనేపథ్యంలో భార్య, భర్త శనివారం పొలం పనులు చూసుకుని తిరిగి ఇంటికి వచ్చే సమయంలో గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కోటయ్య సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ దంపతుల బలవన్మరణంతో అగ్రహారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సైదాపురం : మండలంలోని మర్లపూడిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివరామయ్య (72) శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ విషయమై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేశారు. మర్లపూడి గ్రామానికి చెందిన శివరామయ్య శనివారం మర్లపూడి -చీకవోలు సమీపంలో ఉండగా బొలెరో వాహనం ఢీకొనడంతో శివరామయ్య తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కల్యాణ వెంకన్నకు అభిషేక సింహాసనం బహూకరణ



అభిషేక సింహాసనాన్ని అందజేస్తున్న దాతలు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి దాతలు అభిషేక సింహాసనాన్ని బహూకరించారు. శనివారం ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి అందజేశారు. బెంగళూరులోని ఎల క్ట్రానిక్ సిటీకు చెందిన మదన్ మోహన్ రెడ్డి, యువజ్యోతి దంపతులు స్వామి వారికి కైంకర్యాలను నిర్వహించేందుకు అభిషేక సింహాసనం అవసరమని తెలుసుకుని, అభిషేక సింహాసనాన్ని రూ.9 లక్షల వ్యయంతో తయారు చేయించారు. అనంతరం వాటిని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

యూత్ ఎంటర్‌టైన్మెంట్ చిత్రం 'ప్రేమిస్తున్నా'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమిస్తున్నా చిత్రం దర్శకుడు భాను

తిరుపతి కల్చరల్ : ఐబీఎం ప్రొడెక్షన్స్ ద్వారా చక్కటి ప్రేమ కథతో పాటు మదర్ సెంటిమెంట్ మిళతంతో యూత్ ఎంటర్‌టైన్మెంట్‌తో రూపొందించిన 'ప్రేమిస్తున్నా' చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని ఈ చిత్రం దర్శకుడు భాను తెలిపారు. నవంబర్ 7వ తేదీన ఈ చిత్రం విడుదల సందర్భంగా చిత్రం యూనిట్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్న యూనిట్ సభ్యులు శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల శ్రీవారి ఆశీస్సుల పొందిన అనంతరం ఈ చిత్రం ట్రైలర్‌తో పాటు రెండు పాటలను యూటూబ్ ద్వారా విడుదల చేశామని, దీనికి విశేష స్పందన లభిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తాను రూపొందించిన ఫ్యామిలీ చిత్రాలు రూపొందించి విజయం సాధించడం జరిగిందని, ప్రస్తుతం ఈ చిత్రాన్ని పూర్తి లవ్ స్టోరీతో చిత్రీకరించామన్నారు. ఈ చిత్రంలో 19 సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించి మెప్పించిన సాత్విక్ వర్మ తొలి సారి హీరోగా నటించారని తెలిపారు. ఈ సినిమాలో తిరుపతికి చెందిన ప్రీతి నేహా హీరోయిన్‌గా నటించిందన్నారు. అంతేకాక ఈ సినిమాకు టాప్ టెక్నీషన్స్ పనిచేయడంతో పాటు సిద్దార్థ సాల్వా సంగీత దర్శకుడిగా పరిచయం చేయడం జరిగిందన్నారు. చిత్రం హీరో సాత్విక్ వర్మ మాట్లాడుతూ.. తన ప్రతిభను గుర్తించి తొలిసారిగా ఈ చిత్రంలో హీరో అవకాశాన్ని దర్శకుడు భాను కల్పించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా నటించి మెప్పించానని తెలిపారు. నవంబర్ 7వ తేదీన విడుదల వుతున్న ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐబీఎం ప్రొడెక్షన్ అధినేత కనక దుర్గారావు, రవికుమార్ పాల్గొన్నారు.

యల్లంపల్లిలో గజరాజులు

- పంటలను ధ్వంసం చేస్తున్న వైనం
- లబోదిబోమంటున్న అన్నదాతలు



ఏనుగులు ధ్వంసం చేసిన వరి పంటను చూపుతున్న రైతు

చంద్రగిరి:అటవీ సమీప ప్రాంతాల్లోని పంట పొలాలపై గజరాజుల దాడులు నిత్యకృత్యమవుతున్నాయి. పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో గజ దాడులతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు.. మండల పరిధిలోని యల్లంపల్లిలోని పంట పొలాలపై శుక్రవారం రాత్రి సుమారు 11 ఏనుగుల గుంపు చేరుకున్నాయి. రాత్రి 7 గంటలకు ఏనుగులను గుర్తించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. రెండు గంటల పాటు అటవీ అధికారులు రాకపోవడంతో పంట పొలాలను తొక్కి నాశనం చేసినట్లుగా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందించిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ఉంటే నష్ట తీవ్రత తగ్గేదని, అయితే అటవీ అధికారులు నిర్లక్ష్యంగా కారణంగా తమ పంటలు ధ్వంసమయ్యాయని రైతులు వాపోతున్నారు. కష్టపడి పండించిన పంట చేతికి రాకపోవడంతో తీవ్ర అప్పులపాలవుతున్నామంటూ వాపోతున్నారు. చివరకు అర్ధరాత్రి తర్వాత గ్రామస్తులు, అటవీ అధికారులు సంయుక్తంగా బాణాసంచా పేల్చుతూ, కేకలు వేయడంతో ఏనుగులు అడవుల్లోకి వెళ్లిపోయాయి. అయితే శనివారం రాత్రి కూడా ఏనుగులు వచ్చే అవకాశం ఉండటంతో యల్లంపల్లితో పాటు పరిసర అటవీ సమీప గ్రామ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్ఐలు

రేణిగుంట : పట్టణం సమీపంలోని గువ్వల కాలనీలో శ్రీహరి(17)ని శుక్రవారం హత్య చేసిన మేస్త్రి అనే వ్యక్తిని రేణిగుంట రూరల్ సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో గాజుల మండ్యం ఎస్ఐ సుధాకర్ శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. వెకిలిగా నవ్వాడని శుక్రవారం బాలుడిని మేస్త్రీ అనే వ్యక్తి హత్య చేసిన విషయం తెలిసిందే.

మందుల వాడకంలో జాగ్రత్తలు అవసరం

తిరుపతి తుడా: రోగులు మందుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని డ్రగ్ రియాక్షన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచిన్ తెలిపారు. స్విమ్స్ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫార్మకోవిజిలెన్స్-రిపోర్టింగ్ ఆఫ్ అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ అనే అంశంపై శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి వైద్యాధికారులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పద్మావతి మహిళా వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ అంజు, మహిళా వైద్యకళాశాల పార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ కేఆర్ సుభాష్, సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సునీత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పల్లవి, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ భార్గవి, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

పెరటాసి మాసం.. భక్తి పారవశ్యం





పెరటాసి మాసం నాలుగో శనివారం సందర్భంగా ఏడుకొండలస్వామి సేవకు భక్తజనం పోటెత్తింది. భక్తులు తిరుమలేశుని దర్శనానికి వెళుతూ పాదాల మండపం వద్ద పిండి దీపాలు వెలిగించి, భక్తి పారవశ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో కాలినడకన శ్రీవారిని ప్రణామం చేసుకుంటూ మెట్టు మెట్టుకు ప్రణామం చేసుకుంటూ తిరుమలకు వెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

పాదాల మండపం వద్ద భక్తుల పూజలు